క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీలో యువతకు ప్రాధాన్యం

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ అధిష్టానం యువతకు ప్రాధాన్యత ఇస్తోందని, ఇందులో భాగంగానే పలువురు పార్టీలో చేరుతున్నారని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. గాజుల రామారం డివిజన్ కైసర్‌నగర్‌కు చెందిన సయ్యద్ షఫీ ఆధ్వర్యంలో ఐఎంఐఎం, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన మిత్రబృందంతో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్ కుమార్, జేమ్స్, జహంగీర్ పాల్గొన్నారు.

'అందరి అభివృద్ధికి కృషి'



ముదిరాజ్ సంఘం భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

రంగారెడ్డినగర్: అన్ని సామాజికవర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని శాసనమండలి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ మున్సిపల్ పరిధి భౌరంపేట్‌లో జరుగుతున్న ముదిరాజ్ సంఘం భవన నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

30న ఆలయ వార్షికోత్సవం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ మీనాక్షి ఎస్టేట్స్ కాలనీలోని శ్రీ అభయాంజనేయ శివ పంచాయతన ఆలయ చతుర్థి వార్షికోత్సవాన్ని ఈ నెల 30న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపింది. 30వ తేదీ ఉదయం 7 గంటలకు అభిషేకం, పుణ్యాహవచనం, 8 గంటలకు గణపతి పూజ, కలశ స్థాపనము, ఉదయం 10 గంటలకు హోమం, పూర్ణాహుతి, మధ్యాహ్నం 12 గంటలకు తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ కోరింది.

ఉత్సాహంగా స్నాతకోత్సవం



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న రజత్‌ఓజా, దుర్గాప్రసాద్

నిజాంపేట్: బాచుపల్లిలోని విజ్ఞాన్ జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో శనివారం 28వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. గ్రామిటానిక్స్ సీఈవో రజత్ ఓజా ముఖ్య అతిథిగా హాజరై పోస్ట్ గ్రాడ్యుయేట్లకు సర్టిఫికెట్లు, పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో జయాపజయాలు రెండు కలిసి ఉంటాయని, దానికి తగ్గట్టుగా పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కళాశాల డైరెక్టర్ సీహెచ్ఎస్ దుర్గాప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ కోడె దుర్గాప్రసాద్ తదితరులు మాట్లాడారు.

అనాథ విద్యార్థుల భవిష్యత్‌కు సహకరిస్తా

- జేఎన్‌టీయూసీ వైస్ చాన్సలర్ కట్టా నర్సింహారెడ్డి



దిల్‌సుఖ్‌నగర్: అనాథ విద్యార్థుల భవిష్యత్ కోసం అన్ని విధాలుగా పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ కట్టా నర్సింహారెడ్డి అన్నారు. ఆర్‌కేపురం చిత్ర లేఅవుట్‌లోని అనాథ విద్యార్థి గృహంలో శనివారం కట్టా నర్సింహారెడ్డి, కల్పనాదేవిల వివాహ వార్షికోత్సవాన్ని అనాథ విద్యార్థుల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ, విద్యార్థులు తమ బంగారు భవిష్యత్ కోసం ఒక లక్ష్యంతో పనిచేసి తమ భవిష్యత్‌ను తీర్చి దిద్దుకోవాలని కోరారు. కార్యక్రమానికి హాజరైన అవేర్ ఫౌండేషన్ చైర్మన్ మాధవన్ మాట్లాడుతూ, అనాథ విద్యార్థి గృహం అత్యున్నత ప్రమాణాలతో నడుస్తోందని, గృహంలోని కంప్యూటర్ లాబ్‌కు ఫౌండేషన్ తరఫున రూ. 50 వేలు అందజేశారు. వివాహ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు దుస్తులు ఇచ్చి, విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ సురేష్, రంజిత్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

29న మంత్రి పర్యటన

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మండలంలో ఈ నెల 29న మంత్రి మల్లారెడ్డి పర్యటించనున్నట్లు ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో మంత్రి పాల్గొననున్నట్లు ఆమె వివరించారు.

నిరసనలు..నిలదీతలు

- దశాబ్ది ఉత్సవాల సమావేశం రసాభాస
- ధాన్యం కొనుగోళ్లు, స్థానిక సంస్థలకు నిధులపై ఆగ్రహం
- మంత్రి మల్లారెడ్డి ప్రసంగాన్ని అడ్డుకున్న బీజేపీ ప్రతినిధులు
- ఎంపీటీసీ శోభను లాక్కెళ్లిన బీఆర్ఎస్ నేతలు
- పోలీసుల ప్రేక్షక పాత్ర. పట్టించుకోని అధికారులు



సమావేశంలో ఆందోళన చేస్తున్న బీజేపీ ప్రజా ప్రతినిధులు

సాక్షి,మేడ్చల్ జిల్లా : కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంత్రి మల్లారెడ్డి అధ్వర్యంలో శనివారం దశాబ్ది ఉత్సవాల విజయవంతంపై నిర్వహించిన సమావేశం రసాభాసగా మారింది. దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ జూన్ 12 నిర్వహించనున్న తెలంగాణ రన్ కార్యక్రమంలో సినీ తారలను భాగస్వామ్యం చేస్తామని చెబుతుండగానే బీజేపీ ప్రజాప్రతినిధులు లేచి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని, స్థానిక సంస్థలకు నిధులు కేటాయించాలని, పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ వాగ్వాదానికి దిగారు. ప్రజలు బాధల్లో ఉంటే..దశాబ్ది ఉత్సవాలెందుకని, దీనిపై మంత్రి సమాధానం చెప్పాలని నిలదీశారు. మంత్రి ప్రసంగాన్ని అడ్డుకునేందుకు వారు యత్నించారు. గ్రామాలు, పట్టణాల్లో నిధులు లేక అభివృద్ధి పడకేసిందని వేడుకల పేరుతో డబ్బులు ఖర్చు చేయడం దారుణమని ఘట్కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, ఎంటీటీసీలు శోభ, వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ మహేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో బీజేపీ ,బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధుల వాగ్వాదాలతో గందరగోళం నెలకొంది. వారిని అదుపు చేసేందుకు పలువురు అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో బీజేపీ ప్రతినిధులను పోలీసులు బలవంతంగా హాల్ నుంచి బయటికి తీసుకెళ్లగా, ప్రధాన ద్వారం వద్ద వారు బైఠాయించారు. బీజేపీ ఎంపీటీసి శోభ ధాన్యం కొనుగోళ్లపై స్పష్టత ఇవ్వాలని కోరుతుండగానే ...మంత్రి సైగలతో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు మహిళా ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మేయర్లు ఆమెను బలవంతంగా హాల్‌లో నుంచి బయటికి లాక్కెళ్లారు. మంత్రి ,జిల్లా కలెక్టర్ సభలో ఉండగానే ఎంపీటీసీని ఈడ్చుకెళ్లిన తీరుపై బీజేపీ ప్రజానిధులు నిరసన వ్యక్తం చేశారు. సభను బహిష్కరించి ప్రధాన ద్వారం వద్ద అందోళనకు దిగారు.



ఎంపీటీసీ శోభను లాక్కెళుతున్న దృశ్యం

బీఆర్ఎస్ నేతల వైఖరి అనైతికం: ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్కేసర్ మండలంలోని పలు గ్రామాల్లో 20 రోజులుగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టకపోవటంతో కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారని ఘట్కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సభలో మంత్రి, కలెక్టర్ ,సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుండగా, బీజేపీ ప్రజానిధులపై బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు దాడికి యత్నించటం దారుణమన్నారు. స్థానిక సంస్థల ప్రతినిధుల సమావేశంలో సభ్యులు కాని వారు ముఖ్యంగా బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం విడ్డూరంగా ఉందన్నారు. ఇందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాల అభివృద్ధికి నిధులివ్వని ప్రభుత్వం, దశాబ్ది ఉత్సవాలకు రూ.కోట్లు ఖర్చు చేయటం దారుణమని భాగారం ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి అన్నారు. బీజేపీ ప్రతినిధులపై బీఆర్ఎస్ కార్యకర్తలు దాడికి యత్నించినా ,పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని, అధికార యంత్రాంగం పట్టించుకోలేదని ఆరోపించారు. రైతులు, ప్రజల సమస్యలను సమావేశం దృష్టికి తీసుకెళుతుండగా, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు దాడి చేసి, బలవంతంగా ఈడ్చుకెళ్లడం పై బీజేపీ ఎంపీటీసీ శోభ ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోడ్లు అధ్వానం.. పట్టించుకోని అధికారులు



జీడిమెట్ల ఫేజ్-3 రెండవ గేటులోని రోడ్డు..

జీడిమెట్ల: రోడ్లు అధ్వానంగా మారినా జీడిమెట్ల ఐలా సిబ్బంది పట్టించుకోవడం లేదు. జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియాలోకి వాహనాలు, కార్మికులు వచ్చేందుకు జీడిమెట్ల ఫేజ్-1లో రెండు, ఫేజ్-2లో రెండు , ఫేజ్-3లో రెండు గేట్లను ఏర్పాటు చేశారు. ఆ రోడ్లు జీడిమెట్ల పారిశ్రామికవాడకు వచ్చేందుకు ప్రధాన రోడ్లుగా వాడకంలో ఉన్నాయి. అయితే ఫేజ్-3 రెండో గేటు రోడ్డు మాత్రం మూడు సంవత్సరాలుగా అధ్వానంగా మారింది. ఆ రోడ్డులో ఓపెన్ నాలాలు ఏర్పాటు చేసేందుకు తవ్వకాలు చేపట్టి నిర్మాణాలు పూర్తి చేయకుండా అలానే వదిలేశారు. దీంతో వాహనాల, కార్మికుల రాకపోకలు పూర్తిగా ఆగిపోయాయి.

వ్యర్థాల పారబోతకు కేరాఫ్‌గా..

సమీపంలో ఉన్న చికెన్ సెంటర్ల నుండి కొంతమంది వ్యర్థాలను తీసుకువచ్చి నాలాలో పారబోసి వెళ్తున్నారు. దీనికి తోడు వివిధ పరిశ్రమల్లో వెలువడిన వ్యర్థాలను ఆరోడ్డులో పారబోస్తున్నారు. దీంతో రోడ్డు కాస్తా చెత్త డంపింగ్‌కు కేంద్రంగా మారింది. ఈ రోడ్డును ఇలానే అధికారులు పట్టించుకోకుండా వదిలేస్తే రోడ్డు దుర్గంధంగా మారే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని రోడ్డులో మరమ్మతులు చేపట్టి రాకపోకలకు వీలుగా తయారు చేయాలని వాహనదారులు, కార్మికులు కోరుతున్నారు.

జూబ్లీహిల్స్ దొంగ దొరికాడు



నిందితుడు రాజేష్ యాదవ్

బంజారాహిల్స్: గర్భిణి మెడపై కత్తి పెట్టి రూ.10 లక్షలు చోరీ చేసిన ఘటనలో నిందితుడిని జూబ్లీహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. జూబ్లీ హిల్స్ రోడ్ నెం. 58లో నివసించే ప్రముఖ వ్యాపారి ఎస్.ఎస్.ఎన్.రాజు ఇంట్లోకి ఈ నెల 12వ తేదీ తెల్లవారుజామున ఓ యువకుడు ప్రవేశించి ఆయన కూతురు నవ్య బెడ్రూంలోకి వెళ్లి ఆమె మెడపై కత్తి పెట్టి రూ. 25 లక్షలు డిమాండ్ చేశాడు. గదిలోకి వచ్చిన ఆమె తల్లి లీలను కూడా బెదిరించాడు. తన భర్తకు ఫోన్ చేసిన బాధితురాలు రూ. 8 లక్షలు తెప్పించి ఇంట్లో ఉన్న రూ. 2 లక్షలు కలిపి మొత్తం రూ. 10 లక్షలు నిందితుడికి ఇవ్వడంతో పాటు తన సెల్‌ఫోన్ నుంచి క్యాబ్ బుక్ చేయడంతో అతడు అక్కడి నుంచి పరారయ్యాడు. కేవలం సెల్‌ఫోన్ ఆధారాలు మాత్రమే ఉండగా నిందితుడి కోసం పోలీసులు సాంకేతికతను వినియోగించారు. అదే రోజు మధ్యాహ్నం షాద్‌నగర్‌కు వెళ్లిన నిందితుడు తన కదలికలను పోలీసులు గుర్తుపట్టకుండా ఉండేందుకు నాలుగైదు గంటలు అక్కడే గడిపి తిరిగి క్యాబ్ బుక్ చేసుకొని సికింద్రాబాద్‌లోని రెజిమెంటల్ బజార్‌లో ఉన్న తన ఇంటికి వచ్చాడు. ఆ తెల్లవారే దొంగిలించిన డబ్బులో నుంచి రూ. 2.50 లక్షలు వెచ్చించి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ కొనుగోలు చేశాడు. జల్సాలకు అలవాటుపడ్డ నిందితుడు శుక్రవారం ఉదయం శామీర్‌పేట్‌లోని ఓ ఫామ్ హౌజ్‌లో స్నేహితులకు విందు ఇస్తున్నట్లుగా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా నిందితుడు రెజిమెంటల్ బజార్‌లో నివసించే మోతిరాం రాజేష్ యాదవ్ (27)గా తేలింది. తన ఇంట్లో అప్పులతో పాటు తన జల్సాలకు డబ్బుల కోసమే ఈ దొంగతనానికి పాల్పడినట్లుగా పోలీసుల విచారణలో ఒప్పుకొన్నట్లు సమాచారం. నిందితుడి నుంచి మరింత సమాచారాన్ని రాబడుతున్నారు. చోరీ చేసిన సొత్తును రికవరీ చేసే ప్రయత్నంలో పోలీసులు ఉన్నారు. నిందితుడు జూబ్లీహిల్స్‌లోని ఏదైనా ఓ ఇంట్లోకి దూరి రూ. 25 లక్షలు ఎత్తుకెళ్లాలనే పథకంతో రోడ్ నెం 52లో తిరుగుతుండగా ప్రతి ఇంటి ప్రహరీ గోడ ఎత్తుగా ఉండటంతో లోపలికి దూకడం కష్టతరమైంది. ఒక్క ఎస్ఎస్ఎన్ రాజు నివాస ప్రహరీ మాత్రమే చిన్నగా ఉండటంతో ఆ ఇంటిని ఎంపిక చేసుకొని పక్కా ప్రణాళికతో ఇంట్లోకి దూరినట్లుగా పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

ప్రతిష్టాత్మకంగా దశాబ్ది ఉత్సవాలు

- సన్నాహక సమావేశంలో మంత్రి మల్లారెడ్డి
- హాజరైన ఎమ్మెల్యేలు, కలెక్టర్



సాక్షి,మేడ్చల్ జిల్లా: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను మేడ్చల్ జిల్లాలో ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. 21 రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అమయ్ కుమార్, జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్ ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కె.పి.వివేకానందగౌడ్,భేతి సుభాష్‌రెడ్డితో కలిసి దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం పదేళ్ళలోకి అడుగుపెడుతున్న శుభతరుణంలో ఈ ఉత్సవాన్ని పండగ వాతావరణంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జూన్ 2 నుంచి 21 రోజుల పాటు వివిధ శాఖలు తమకు కేటాయించిన తేదీల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఇప్పటి నుంచే సన్నాహాలు చేపట్టాలన్నారు.

దశాబ్ది ఉత్సవాలకు సమాయాత్తం

- దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని, శాఖల వారీగా సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాలమేరకు శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై అప్రమత్తం చేశామన్నారు. వేడుకల ప్రారంభోత్సవం రోజు నుంచి పూర్తయ్యే వరకు తానే స్వయంగా పర్యవేక్షిస్తానని కలెక్టర్ అమయ్ కుమార్ పేర్కొన్నారు.
- జూన్ 2 నుంచి 21 రోజుల వరకు నిర్వహించే తెలంగాణ దశాబ్ది వేడుకలకు సంబంధించి రోజు వారీ కార్యక్రమాలను కలెక్టర్ వివరించారు.
- సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బెస్త వెంకటేశ్, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు నందారెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, మేయర్లు జక్క వెంకట్‌రెడ్డి, మేకల కావ్య, బుచ్చిరెడ్డి, చైర్మన్లు కొండల్‌రెడ్డి, చంద్రారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు ఏనుగు నర్సింహారెడ్డి, అభిషేక్, డీఆర్‌ఓ లింగ్యానాయక్ ,ఆర్డీఓలు రవి, మల్లయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కార్పొరేటర్లు, మేయర్లు, చైర్మన్లు, డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్మన్లు, మున్సిపల్ కమిషనర్లు, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవాడలో అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

చింతల్: గాంధీనగర్ పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాదంలో తృటిలో కార్మికులు ప్రాణాపాయం నుండి తప్పించుకున్నారు. గాంధీనగర్ పారిశ్రామికవాడలో ఎంటీఏఆర్ యూనిట్ 3 లో మొత్తం 750 మందికి పైగా పనిచేస్తున్నారు. ఇందులో 150 మందికి పైగా మహిళా సిబ్బంది పని చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం పరిశ్రమలోని రియాక్టర్‌లో జెర్కోనియం మెటల్‌ను కరిగిస్తుండగా ఒక్కసారిగా రసాయనిక చర్య జరిగి బ్లాస్ట్ జరిగి మంటలు వ్యాపించాయి.ఆ సమయంలో మొత్తం 750 మందికి పైగా పనిచేస్తున్నారు. సమాచారం అందుకున్న జీడిమెట్ల ఫైర్‌స్టేషన్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తేవడంతో కార్మికులు ఊపిరి పీల్చుకున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణం..

అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతానికి ఫైర్ ఇంజన్ వెళ్లడానికి కూడా జాగా లేకుండా నిర్మాణం చేపట్టారు. పరిశ్రమ చుట్టూ ఫైర్ ఇంజన్ తిరిగేలా స్థలాన్ని వదిలి పెట్టాలన్న నిబంధనలను తుంగలో తొక్కారు.

వార్డు స్థాయిలో పాలనకు ఏర్పాట్లు పూర్తి



జగద్గిరిగుట్ట డివిజన్‌లో రాజీవ్ గృహకల్పలోని మోడల్ మార్కెట్‌కు తుది మెరుగులు..

జగద్గిరిగుట్ట: సమస్యలు సత్వర పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నెలకొల్పనున్న వార్డు స్థాయిలో పాలనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. దీనికి వార్డులవారీగా అధికారులు వారు చేయాల్సిన పనులపై శిక్షణ కూడా తీసుకున్నారు. స్థానికుల నుండి వచ్చిన ఫిర్యాదులే కాకుండా ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా నుండి వచ్చిన వాటిని కూడా పరిష్కరించేలా చూస్తున్నారు. ముఖ్యంగా ఇంజినీరింగ్, శానిటేషన్ పై వచ్చే ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించడానికి ప్రయత్నం చేయాలని వార్డు అధికారులుకు శిక్షణ ఇచ్చారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో జీడిమెట్ల డివిజన్ గాయత్రి నగర్‌లోని మోడల్ మార్కెట్‌లో, సుభాష్ నగర్ డివిజన్‌లో గణేష్ గ్రౌండ్‌లో, రంగారెడ్డినగర్ డివిజన్‌లో గాంధీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో, కుత్బుల్లాపూర్ డివిజన్‌లో పద్మానగర్ ఫేస్1లోని కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్‌లోని మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో, సూరారం డివిజన్ నెహ్రూనగర్ కమ్యూనిటీ హాల్‌లో, గాజులరామారం డివిజన్‌లో మహదేవ్ పురం కమ్యూనిటీ హాల్‌లో, జగద్గిరిగుట్ట డివిజన్‌లో రాజీవ్ గృహకల్పలోని మోడల్ మార్కెట్‌లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ వార్డులలో విధులు నిర్వహించాల్సిన అధికారులను కూడా నియమించారు.



జీడిమెట్ల డివిజన్ గాయత్రి నగర్‌లోని మోడల్ మార్కెట్..

బస్తీ దవాఖానాను ప్రారంభించిన ఎమ్మెల్యే



బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

నిజాంపేట్: పేదలకు మరింత చేరువలో వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి రాజీవ్‌గాంధీనగర్‌లో శనివారం నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను మేయర్ నీలారెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 24 బస్తీ దావాఖానాల ఏర్పాటుతో మేడ్చల్ జిల్లాలోనే వంద శాతం దవాఖానాలు అందుబాటులోని వచ్చాయన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గాజుల సుజాత, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఆనంద్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డీసీ ప్రశాంతి

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

జగద్గిరిగుట్ట: త్వరలో ప్రారంభం కానున్న వార్డు కార్యాలయాలలో ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు కృషి చేయాలని గాజులరామారం డీసీ ప్రశాంతి అన్నారు. శనివారం సర్కిల్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ స్థానిక ప్రజలనుండి ఎటువంటి ఫిర్యాదు వచ్చినా వీలైనంత తొందరగా పూర్తి చేయడానికి ప్రయత్నించాలని, ఫిర్యాదు ఏ డిపార్ట్‌మెంట్ సంబంధించినదైనా స్వీకరించాలని, సంబంధిత అధికారులుకు పంపి ఆ ఫిర్యాదుకు అక్నాలజ్‌మెంట్ ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డుల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు నెలలుగా కాలనీలో మురుగు సమస్య

కుత్బుల్లాపూర్: ఎన్నో ఏళ్ల క్రితం వేసిన పైప్‌లైన్ జామ్ కావడంతో జయభేరి కాలనీలో పలు ప్రాంతాల్లో డ్రైనేజ్ లీకై పొంగిపొర్లుతోంది. కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జయభేరి కాలనీలో గత రెండు నెలలుగా నిత్యం డ్రైనేజీ సమస్య ప్రజలకు ఇబ్బందికరంగా మారుతుంది. ఇదే విషయంపై ఇటీవల మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్‌ను కాలనీవాసులు కలిసి విన్నవించగా సిబ్బందితో తాత్కాలిక పనులు చేపట్టారు. అయితే ఏళ్ల క్రితం వేసిన పైప్‌లైన్, కేవలం 6 ఇంచుల లైను ఉండడంతో ప్రస్తుతం బహుళ అంతస్తుల నిర్మాణాలు భారీగా రావడంతో డ్రైనేజీ వాటర్ ఫ్లో తట్టుకోలేక ఇలా లీకేజీలు ఏర్పడుతున్నాయని గుర్తించిన అధికారులు ఆ దిశగా శాశ్వత పరిష్కారం చేపట్టేందుకు కమిషనర్ శ్రీహరి నేతృత్వంలో ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికలు రూపొందించే పనిలో పడ్డారు.



జయభేరి కాలనీలో ఇళ్ల మధ్యలో చేరిన డ్రైనేజీ నీరు

68 నగరాలలో ఎఫ్ఎస్‌టీపీల ఏర్పాటు

గచ్చిబౌలి: తెలంగాణలోని 68 నగరాలలో ఎఫ్ఎస్‌టీపీ (ఫేకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)లు ఏర్పాటు చేసినట్లు ఎంఏయూడీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అర్వింద్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం గచ్చిబౌలిలోని ఈపీటీఆర్‌ఐలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'ఘన, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ'పై నిర్వహించిన వర్క్ షాపునకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో తెలంగాణ రాష్టానికి 26 స్వచ్ఛ అవార్డులు వచ్చాయని చెప్పారు. వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో 2016లో కొత్త నిబంధనలను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపాలిటీలలో మానవ వ్యర్థాల నిర్వహణపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో తెలంగాణ ముందంజలో ఉందన్నారు. ఈపీటీఆర్‌ఐ డైరెక్టర్ జనరల్ వాణి ప్రసాద్ మాట్లాడారు.

భార్యపై అనుమానంతో మామ దారుణ హత్య

- ముగ్గురు నిందితుల అరెస్ట్

రంగారెడ్డినగర్: భార్యను ఇంటికి పంపేందుకు అత్త మామలు నిరాకరించడంతో కక్ష పెంచుకున్న అల్లుడు తన స్నేహితులతో కలిసి మామను హత్య చేసి తప్పించుకుని తిరుగుతున్న నిందితులను దుండిగల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.. పోలీసులు తెలిపిన మేరకు.. దుండిగల్ మున్సిపాలిటీ చర్చిగాగిల్లాపూర్‌కు చెందిన షేక్ నాసిర్ (31) అదే ప్రాంతానికి చెందిన రమేష్(37) కుమార్తె మహాలక్ష్మిని కిడ్నాప్ చేసి ముంబయ్‌కు తీసుకువెళ్లాడు. అనంతరం తన బంధువుల ఇంట్లో ఆమెపై లైంగిక దాడికి పాల్పడటంతో అప్పట్లో దుండిగల్ పోలీసులు అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ క్రమంలో బెయిల్‌పై విడుదలైన నాసిర్ శిక్ష పడటం ఖాయమని భయపడి బాధితురాలు మహాలక్ష్మిని వివాహం చేసుకున్నాడు. అనంతరం ఇరువురు చర్చిగాగిల్లాపూర్‌లోని సర్వే నెంబరు 214లో కాపురం పెట్టారు. అయితే పెళ్లైన రెండు నెలల పాటు వీరి సంసారం సజావుగా కొనసాగింది. అనంతరం భార్యపై అనుమానం పెంచుకున్న నాసిర్ తరచూ ఆమెను హింసించడం మొదలు పెట్టాడు. దీంతో మహాలక్ష్మి తండ్రి వద్దకు వెళ్లిపోయింది. ఈ క్రమంలో భార్యను ఇంటికి పంపేందుకు నిరాకరించిన మామ రమేష్‌పై కక్షపెంచుకున్న నాసిర్ భార్యతో పాటు మామను సైతం చంపేందుకు పథకం పన్నాడు. తన స్నేహితులు కోటేశ్వరరావు(24), కంచేరి మహేందర్(22)లు మెదక్ జిల్లా గడ్డపోతారం నుండి నాలుగు కత్తులను తెచ్చుకుని హత్య చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. 2022 డిసెంబరు 16న రమేష్ ఇంటికి వచ్చిన నాసిర్ భార్య మహాలక్ష్మిని ఇంటికి పంపాలని అడగగా నిరాకరించడంతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో చర్చిగాగిల్లాపూర్‌లోని నిర్మానుష్య ప్రాంతం నుండి వెళ్తున్న రమేష్‌పై దాడి చేసి ఛాతి, వీపు భాగాల్లో కత్తులతో దాడి చేసి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన రమేష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్న దుండిగల్ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం నాసిర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతనిచ్చిన సమాచారం మేరకు మిగతా నిందితులు కోటేశ్వరరావు, కంచేరి మహేందర్‌లను సైతం అరెస్టు చేశారు. వారి వద్ద నుండి మూడు కత్తులు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు నేరాన్ని అంగీకరించడంతో రిమాండ్‌కు పంపారు.



దుండిగల్ పోలీసుల అదపులో నిందితులు